ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 6 ఆగస్టు 2025



8న వరద కాలువ నీటి కోసం మహాధర్నా

కథలాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వానలు లేక పంటలు ఎండి పోతున్న నేపథ్యంలో వరదకాలువ నీటి విడుదల కోసం ఈ నెల 8న మండల కేంద్రంలో మహాధర్నా నిర్వహించనున్నట్టు మండల రైతు సంఘం అధ్యక్షుడు రిక్కల సంజీవ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల రైతులు, రైతు సమితి సభ్యులతో రాస్తారోకో చేసి నిరసన చేపడతామన్నారు. ప్రభుత్వం వరద కాలువకు నీరు విడుదల చేసేదాకా ఆందోళన కొనసాగిస్తామని ధర్నాకు భారీ సంఖ్యలో రైతుల వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దుమ్ము లేస్తోంది..



వాహనాలు వెళుతున్నపుడు వస్తున్న దుమ్ము, వెల్గటూర్ బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

మండలంలోని వెల్గటూర్- రాజక్కపల్లి గ్రామాల మధ్యన ఉన్న పెద్దవాగుపై నిర్మించిన రెండవ బ్రిడ్జి రెండు రోజుల క్రితం ప్రారంభం అయింది. బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించినా బీటీ రోడ్డు వేయకపోవడంతో వాహనాల రాకపోకల వలన దుమ్ము లేస్తోందని, కనీసం నీరు కూడా కొట్టడం లేదని రాజక్కపల్లి గ్రామస్థులు మండి పడుతున్నారు. దుమ్ము వలన తరచుగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పై నుంచి భారీ వాహనాలు వెళ్లినపుడు వెలువడుతున్న దుమ్ముతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రాణాలు పోతే గానే పట్టించుకోరా? అంటూ వాహనదారులు, రాజక్కపల్లి గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- వెల్గటూర్ (ఆంధ్రజ్యోతి)

కాలువ ఇలా.. సాగునీరు పారేదెలా..?



కాలువలో పేరుకుపోయిన చెత్త

బీర్‌పూర్ మండలంలోని 2ఎల్ కెనాల్‌లో చెత్తా, పిచ్చిమొక్కలు పెరిగిపోయి శివారు భూములకు సాగునీరు అందడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోళ్ల వాగు ప్రాజెక్టు నుంచి విడుదలైన నీరు నర్సింహులపల్లి మీదుగా 2ఎల్ కెనాల్ గుండా తుం గూర్, కొల్వాయి, నర్సింహపల్లి గ్రామాల పంట పొలాలకు సాగు నీరు అందుతుంది. 2018లో బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి 2ఎల్ కెనాల్‌పై 65 లక్షల రూపాయలతో 900 మీటర్ల వరకు అండర్ పైపు లైన్లు వేశారు. ఈ క్రమంలో ప్రధాన రహదారి సమీపంలో సుమారు 50 మీటర్లవరకు పైపులైన్లు వేయకుండా వదిలివేశారు. దీంతో ఓపెన్‌గా ఉన్న కెనాల్‌లో పిచ్చి మొక్కలు పెరిగి, చెత్త పేరుక పోయి దిగువన ఉన్న పంట పొలాలకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సమీపంలో నివసిస్తున్న కుటుంబాలకు దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ చెక్రు నాయక్‌ను వివరణ కోరగా మిగులు 50 మీటర్లు పైపులైన్లు వేసే అవకాశం లేదని, కాలువలో పేరుకుపోయిన చెత్త తొలగిస్తామని తెలిపారు.

- బీర్‌పూర్ (ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతులు జరుగనున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మల్యాల సబ్‌స్టేషన్ పరిధి లోని ముత్యంపేట, గుడిపేట గ్రామాల్లోని వ్యవసాయ బావులకు, గృహాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు జిల్లాకు మంద కృష్ణమాదిగ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ బుధవారం జగిత్యాల పట్టణానికి రానున్నట్లు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.సమావేశానికి జిల్లాలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఎస్సీ, బీసీ వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూభారతి దరఖాస్తులపై విచారణ త్వరగా పూర్తి చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ

కథలాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత నెలలో రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన భూ భారతి దరఖాస్తులపై విచారణ వేగవంతంగా పూర్తి చేయాలని కోరుట్ల ఆర్డీవో జీవాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి కింద స్వీకరించిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల సమస్యలపై తీసుకున్న దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి దానికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ నెల 14 లోపు అన్ని రకాల దరఖాస్తులపై విచారణ పూర్తిచేయాలని ఆదేశించారు. మండలంలో 941 దరఖాస్తులు వివిధ సమస్యలపై స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్, సర్వేయర్ రమేశ్ ఉన్నారు.

మెప్మాలో ఇంటి దొంగలు



- జోరుగా అవినీతి, అక్రమాలు
- రికవరీ కాని సొమ్ము
- జిల్లాలో బ్యాంకులను బురిడీ కొట్టించిన ఆర్పీలు
- నకిలీ సభ్యులతో సంఘాలు.. రూ. లక్షల్లో దండుకున్న సిబ్బంది
- మూడేళ్లుగా కొత్త సంఘాల ఏర్పాటుపై ప్రభావం

జగిత్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ మహిళా పేదరిక నిర్మూలనకు పాటు పడాల్సిన మెప్మా సిబ్బంది అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారు. అందిన కాడికి మేస్తున్నారు. వారి అక్రమాలకు రాజకీయ పలుకుబడి కూడా అనుకూలించడంతో వారి అవినీతికి అడ్డూ అదుపులేకుండా పోయింది. జిల్లాలోని పలు మున్సి పాలిటీల్లో మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంకు రుణాల్లో కొంతమంది ఆర్పీలు తమ అవినీతిని బయటపడకుండా బ్యాంకులను బురిడీ కొట్టిస్తున్నారు. అదీ ఏకంగా మూడు, నాలుగేళ్లుగా కొనసాగుతోంది.

రిసోర్స్ పర్సన్లే కీలకం...

జిల్లాలోని మున్సిపాలిటీల్లో గల మెప్మా విభాగాల్లో మహిళా సంఘాల కార్యకలాపాల నిర్వహణకు రిసోర్స్ పర్సన్‌లే కీలకంగా వ్యవహరిస్తుంటారు. వార్డుకు ఒక ఆర్పీ చొప్పున, పట్టణ సమాఖ్యకు ఒక ఆర్పీ, టీఎంసీలు, ఏడీఎంసీలు, డీఎంసీలు వివిధ స్థాయిలో బాధ్యతలు నిర్వర్తిస్తారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయడం, స్త్రీ నిధి రుణాల పంపిణీ, బ్యాంకు కిస్తీల చెల్లింపు, రుణాల రికవరీ తదితర వ్యవహారాల్లో ఆర్పీలు బాధ్యత కీలకంగా ఉంటుంది. సంఘాల సభ్యులు రుణాలు పొందాలన్న, తీర్మానాలు చేసుకోవాలన్నా ఆర్పీలు రిపోర్టులు తయారు చేస్తుంటారు.

నకిలీ సంఘాలను సృష్టించి రుణాలు..

జిల్లాలోని కోరుట్ల, ధర్మపురి, రాయికల్ తదితర మున్సిపాలిటీల్లో పలువురు రిసోర్స్‌పర్సన్లు నకిలీ సంఘాలను సృష్టించి బ్యాంకు లింకేజీ రుణాలు పొంది సొంతానికి వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా జగిత్యాల, మెట్‌పల్లిలో ఓ బ్యాంకులో నకిలీ సంఘాలు, నకిలీ సభ్యులతో ఖాతాలు తెరిచి రుణాలు పొందిన సంఘటనలు గతంలో వెలుగు చూశాయి. నకిలీ సర్టిఫికేట్లతో గ్రూపులు సృష్టించి రుణాలు పొందినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం మహిళా సంఘాల సభ్యులు రుణాలు తీసుకోవాలంటే ఆర్పీలు సమావేశం ఏర్పాటు చేసి ఒక ఫైల్ క్రియేట్ చేసిన తర్వాత వాటిని కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) పరిశీలించి సంతకం పెట్టాలి. అనంతరం టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ (టీఎంసీ) పరిశీలిస్తారు. రుణానికి సంబంధించిన ఫైల్ బ్యాంకుకు వెళ్లిన తర్వాత అక్కడ అధికారులు పరిశీలిస్తారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసీపీ) అనే వెబ్‌సైట్‌లో సభ్యుల పేర్లు ఉంటేనే అది నిజమైన గ్రూపు అని తెలుస్తోంది. కానీ బ్యాంకు అధికారులను బురిడీ కొట్టిస్తూ ఎంసీపీ ఆన్‌లైన్‌లో ఉన్న సంఘ సభ్యుల పేర్లు కాకుండా మ్యానువల్ పేపర్లలో ఇతర ఫేక్ సభ్యుల పేర్లు జతపరిచి నకిలీ పత్రాలు సమర్పించి లోన్లు పొందుతున్నట్లు తెలుస్తోంది. సర్టిఫికేట్ వెరిఫికేషన్, లోన్లు మంజూరు సమయంలో ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో సమర్పించిన పత్రాలను సరిపోల్చుకొని

మిగతా 8వ పేజీలో

జిల్లా వివరాలు ఇలా..

మొత్తం మున్సిపాలిటీలు	5
మెప్మా రిసోర్స్ పర్సన్‌లు	173
పట్టణ మహిళా సమాఖ్య సంఘాలు	5
స్వయం సహాయక మహిళా సంఘాలు	5,361
మహిళా సంఘాల్లో సభ్యుల సంఖ్య	58,076

జిల్లాలో కొన్ని సంఘటనలు..

- కోరుట్లలో 2023 జనవరి నెలలో ఓ ఆర్పీ అధికారుల సహాయంతో బ్యాంకు లింకేజీ రుణం 10 లక్షల రూపాయలను దుర్వినియోగానికి పాల్పడినట్లు ఉన్నతాధికారుల విచారణలో వెలుగు చూసింది.
- మెట్‌పల్లిలో 2023 జనవరి నెలలో ఓ ఆర్పీ రూ. 10 లక్షల రుణాన్ని అక్రమంగా పొంది సొంతానికి వాడుకున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఏప్రిల్‌లో ఓ ఆర్పీ మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన నాలుగు లక్షల రూపాయలను సొంతానికి వినియోగించుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది.
- కోరుట్లలో 2023 ఫిబ్రవరి నెలలో ఓ ఆర్పీ 16 స్వయం సహాయక సంఘాలకు రూ. 1.85 కోట్లు రుణాలు ఇప్పించగా అందులో రూ. 72 లక్షల రుణాలను నకిలీ సంఘాలతో బ్యాంకులను బురిడీ కొట్టించి పొందినట్లుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయింది.
- జగిత్యాలలో 2022 సంవత్సరం నుంచి 2025 సంవత్సరం వరకు పలు బ్యాంకుల్లో ఓ రిసోర్స్ పర్సన్ సుమారు 57 మహిళా సంఘాల్లో కొందరు నకిలీ సభ్యులను చేర్చి రుణాలు పొందినట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. సుమారు మూడు లక్షల 50వేల వరకు రుణాలు తప్పుదారి పట్టినట్లుగా గుర్తించారు. ప్రధానంగా బ్యాంక్ ఆఫ్ బరోడాలో నకిలీ సంఘాలతో రుణాలు పొందినట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఇందులో ఒకరిద్దరు మెప్మా ఆర్పీలు కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఐఈవో నారాయణ



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి నారాయణ

కొడిమ్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, అధ్యాపకులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి(డీఐఈవో) బి నారాయణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల బోధన, ఆన్‌లైన్ క్లాసులు, కళాశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కొడిమ్యాల కళాశాల మరమ్మతులకు 14లక్షల రూపాయల నిధుల మంజూరు చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న సైన్స్ విద్యార్థులకు ఫిజిక్స్ వాలా సంస్థ ద్వారా ఎప్‌సెట్, నీట్ తరగతులు, ఆర్ట్స్ విద్యార్థులకు క్లాట్, సీఏ ఎంట్రెన్స్ కోసం ఉచిత ఆన్‌లైన్ తరగతులను అందిస్తున్నామని వివరించారు.అనంతరం కళాశాల ఆవరణలో మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ కె వేణు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

కొడిమ్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియా కొరత లేదని, రైతులు అధైర్య పడవద్దని డీసీవో మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలోని తిర్మాలాపూర్, పూడూర్ గ్రామాల్లోని సింగిల్ విండో కార్యాలయాలను డీసీవో మనోజ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీవో సిబ్బందితో మాట్లాడుతూ రైతులకు సంబంధించిన ఆధార్, పట్టాదారు పాసు బుక్‌లను పరిశీలించి యూరియా అందించాలని సూచించారు. పీవోఎస్ మిషన్ ద్వారా రైతులకు యూరియా ఇవ్వాలని సూచించారు. యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, తిర్మాలాపూర్ కార్యదర్శి కుర్షీద్‌అహ్మద్, పూడూర్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, రెండు కార్యాలయాల సిబ్బంది ఉన్నారు.

సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించండి



సోలార్ పలకలను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు పర్యావరణ హితమైన సోలార్ విద్యుత్‌వైపు దృష్టి సారించాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం సూచించారు. మంగళవారం విద్యుత్ వినియోగదారులు, పరిశ్రమల యజమానులు, వ్యాపారస్తులకు సోలార్ ఇంధన వనరుల ఆవశ్యకతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్య ఘర్ యోజన, పీఎం కుసుమ్ తదితర సబ్సిడీ పథకాలు ప్రవేశపెట్టి హరిత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహి స్తోందన్నారు. అనంతరం సోలార్ పలకల ఉత్పత్తిపై వినియోగదారుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డీఈ మధుసూదన్, ఏడీఈ మనోహర్, ఏఈలు అమరేందర్, రవి, అజయ్, శివకుమార్, నవీన్, పరిశ్రమల యజమానులు, వెల్డింగ్ అసోసియేషన్, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలి

కలెక్టర్ సత్యప్రసాద్



పీహెచ్‌సీకి వచ్చిన విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటిస్తూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని ల్యాబ్, ఫార్మసీ గది, మందులు, రికార్డులు, ఓపీ రిజిస్టర్, వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు, అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని భూభారతిలో వచ్చిన దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఆగస్టు 14లోపు నాణ్యమైన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్, డీటీ శ్రీనివాస్, వైద్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగుపై అప్రమత్తత అవసరం

కథలాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరిలో ప్రస్తుతం అక్కడక్కడ కాండం తొలుచు పురుగు ఆశిస్తున్న నేపథ్యంలో రైతాంగం అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి యోగిత సూచించారు. మండలంలోని బొమ్మెనలో మంగళవారం పలువురి రైతుల పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఈవో మౌనిక, రైతులు ఆనంద్‌రెడ్డి, అంజయ్య ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో లైవ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను హైదరాబాద్‌లో చేపట్టారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో లైవ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించేందుకు భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు లైవ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న సమయంలో జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంపులో ఉన్న బీఆర్ఎస్ భవన్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపంతో అంతరాయం ఏర్పడింది. దీంతో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ భవన్ నుంచి జయ శంకర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి సెల్‌ఫోన్లో లైవ్ చూస్తూ ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రవి శంకర్, వసంతలు మాట్లాడుతూ ప్రజలకు నిజాలు తెలుస్తాయనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కట్ చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగం భూమయ్య, వొళ్లెం మల్లేశం, ఆనందరావు, అనురాధ, ఆనందరావు, శ్రీధర్‌రెడ్డి, దేవేందర్ నాయక్, శివ కేసరిబాబు ఉన్నారు.

రూ. 52 కోట్ల నిధులు విడుదలకు సీఎం హామీ

మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నూకపల్లి సమీపంలో అర్థాంతరంగా నిలిచిన 1,611 ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పూర్తి చేయడానికి అవసరమైన రూ. 52 కోట్ల నిధులను మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీనిచ్చినట్లు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హైద్రాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. 2008 సంవత్సరంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని నూకపల్లి శివారులో సేకరించి నాలుగు వేల మంది ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. వివిధ దశల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తెలిపారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ నమోదుకు అవకాశం

కొడిమ్యాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులైన మహిళలు ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం సమీపంలోని గ్యాస్ ఏజెన్సీలలో పేరు నమోదు చేసుకోవాలని బీజేపీ కొడిమ్యాల యువ నాయకుడు బోగ రాకేష్ కోరారు. మంగళవారం బీజేపీ నాయకుడు మాట్లాడుతూ ఇటీవల నూతనంగా రేషన్ కార్డు పొందిన లబ్ధిదారులు కుటుంబంలోని అందరి సభ్యుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌లతో పాటుగా నాలుగు ఫొటోలతో గ్యాస్ ఏజెన్సీలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక డంపులు పట్టివేత

ఎండపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 40 ట్రాక్టర్ల ఇసుక డంపులను బసంతనగర్ పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. బుధవారం వేలం పాట నిర్వహించనున్నారు.

భూభారతి సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన

● సిబ్బంది లేక దరఖాస్తుల పరిశీలనలో జాప్యం



విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భూభారతి సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను మండల రెవెన్యూ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారు. సిబ్బంది తక్కువ ఉండడంతో సమస్యలను సరైన సమయంలో పరిష్కరించలేక పోతున్నారు. అడ్డంకులను అధిగమిస్తూ ఆగస్టు 15 వరకు వంద శాతం సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

కరీంనగర్ రూరల్ మండలంలో జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. మొత్తం 14 రెవెన్యూ గ్రామాల్లో 2,467 దరఖాస్తులు వచ్చాయి. వీటిని భూభారతి పోర్టల్‌లో నమోదు చశారు. వీటిలో సాదాబైనామా దరఖాస్తులను మినహా ఒక్కో దరఖాస్తును పరిశీలించి గ్రామాల వారిగా నోటీసులు జారీ చేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో రెండు నుంచి మూడు రోజుల పాటు మోఖాపైకి వెళ్లి విచారణ నిర్వహిస్తున్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకు వారసత్వ పట్టాలను జారి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలను మాత్రం ఇవ్వడం లేదని అధికారులు తెలిపారు. వివాద రహిత దరఖాస్తులను మాత్రమే పరిష్కరిస్తుండగా కోర్టు కేసులు, ఇతర భూ వివాదాలు ఉన్న దరఖాస్తులను పక్కన పెడుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భూపతిపూర్ విద్యార్థి

రాయికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సంద్రుగు ప్రవస్తి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రవస్తి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-12 గర్ల్స్ విభాగంలో లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించి జనగాంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేత వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ రమేష్‌రెడ్డి ప్రోత్సాహకంగా నగదు అందజేశారు. కార్యక్రమంలో పీడీ రాజగోపాల్, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, యూత్ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, విక్రమ్, రవిష్ రెడ్డి, టీవీ గోపాల్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

- ఆధునిక టెక్నాలజీతో దొంగతనాలు..
- అదే టెక్నాలజీతో పోలీసుల కేసుల ఛేదన

అన్నింటా సాంకేతికత





కరీంనగర్ క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత దానిని అన్ని అంశాల్లో ఉపయోగిస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించి దొంగలు, ఇతర నేరస్థులు నేరాలకు పాల్పడుతున్నారు. ఆధారాలు లేకుండా చేస్తూ పోలీసుల నుంచి తప్పించుకుం టున్నారు. అదే టెక్నాలజీని ఉపయోగించి పోలీసులు నిందితులను పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతికత రెండు వైపులా పదునున్న కత్తిలా మారింది.

ఆధారాలు చిక్కకుండా జాగ్రత్తలు

దొంగతనాలకు, నేరాలు జరిగినప్పుడు పోలీసులు ఆ స్థలంలో నేరస్థుల వేలిముద్రలు సేకరిస్తుంటారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తారు. ఆ ప్రాంతంలో నేరం జరిగిన సమయంలో మొబైల్ ఫోన్ల డంపు ద్వారా నేరస్థులను గుర్తించేందుకు ప్రయత్నిస్తారు. నేరస్థులు పోలీసులకు చిక్కకుండా, ఎలాంటి ఆధారాలు లభించకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా వేలిముద్రలు దొరకకుండా చేతులకు గ్లౌస్‌లు, సీసీ కెమెరాల్లో కనపడకుండా ముఖానికి ముసుగులు, మాస్కులు వాడుతున్నారు. నేరం చేసిన స్థలంలో ఫోన్‌ను వాడకుండా వాకీటాకీ ఉపయోగిస్తున్నారు. సొంత వాహనాలను ఉపయోగిస్తే వాహనాల నంబర్‌తో పోలీసులు చిక్కుతామని దొంగతనాలకు పాల్పడే సమయంలో చోరీ చేసిన వాహనాలను వినియోగిస్తున్నారు.

సాంకేతికత సహాయంతో పోలీసులు ఛేదించిన కేసులు

ఐదేళ్ల క్రితం కరీంనగర్‌లో హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని రాధిక కేసులో సంఘటనాస్థలంలో నిందితులకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. హైదరాబాద్ సిటీ పోలీసు నుంచి క్రైం ఆఫీసర్(సీఎస్ఓ) ఇంద్రాణి(ఫోరెన్సిక్ సైన్స్) ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల టీం రాధిక హత్య జరిగిన గదిని పరిశీలించి పలు ఆధారాలను సేకరించింది. జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో రక్తపు మరకలు శుభ్రం చేసినప్పటికీ తెలుసుకునే వీలుంది. 3డీ క్రైం సీన్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, 3డీ స్కానర్ (ఫారో), బాడీ ఫ్లూయిడ్ కిట్‌లతో కీలక ఆధారాలను సేకరించారు. చివరకు కన్నతండ్రే హంతకుడని గుర్తించారు

● కరీంనగర్‌లోని శ్రీపురం కాలనీలో ఒక వ్యక్తిని బాత్‌రూంలో బంధించి, అందులోకి వంట గ్యాస్‌ను వదిలి శ్వాసాడకుండా చేసి హత్య చేశారు. అదృశ్యం కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతుండగా తన బ్యాంక్ ఖాతాలో అర్జంటుగా 50 వేలు జమచేయాలని ఒక రోజు మృతుడి ఫోన్ నుంచి అతని తండ్రికి మెస్సేజ్ వచ్చింది. డబ్బులు జమ చేసిన తర్వాత నిందితులు సిద్ధిపేటలోని ఏటీఎం సెంటర్ నుంచి డబ్బులు డ్రా చేస్తుండగా సీసీ కెమెరా ఫుటేజి ద్వారా గుర్తించి అరెస్టు చేశారు.

● రెండేళ్ల క్రితం కరీంనగర్ మంచిర్యాల చౌరస్తాలో ఒక టాటాసుమోతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఒక మహిళా ఉద్యోగిని హత్య చేశారు. తీవ్ర గాయాలతో వారం రోజుల తరువాత మహిళ మరణించగా, 15 రోజులకు భర్త కోలుకుని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఈ హత్య వెలుగు చూసింది. మొదట ప్రమాదంగానే పోలీసులు కేసు నమోదు చేయగా, సీసీ కెమెరా ఫుటేజీ, కాల్ డేటాతో నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

● కరీంనగర్‌లో మాయమవుతున్న లారీలు తెల్లవారేసరికి మహారాష్ట్రలోని పర్బనీ ప్రాంతంలో తేలుతున్నాయి. గుర్తించేలోగానే 24 గంటల్లో ఆ లారీలు స్క్రాప్‌గా మారుతున్నాయి. మహారాష్ట్ర కేంద్రంగా స్క్రాప్ మాఫియా దేశవ్యాప్తంగా లారీలను దొంగిలించి పర్బనిలో గుట్టుచప్పుడు కాకుండా తుక్కుగా మారుస్తున్నది. కరీంనగర్‌లో చోరీకి గురైన లారీకి జీపీఎస్ బిగించి ఉండడంతో లారీ ఎక్కడికి వెళ్లిందనేది గుర్తించి నిందితులను అరెస్టు చేశారు.

కారులో తిరుగుతూ.. గూగుల్ మ్యాప్స్‌లో గుర్తిస్తూ..



ప్రస్తుతం గూగుల్ మాప్స్ ప్రజలకు దిక్సూచిగా నిలుస్తున్నాయి. అదే గూగుల్ మ్యాప్ సహాయంతో దొంగతనాలు చేయడం పోలీసులతోపాటు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. పొరుగు జిల్లా నిజామాబాద్‌కు చెందిన ఒక యువకుడు కరీంనగర్‌కు వచ్చాడు. ఇక్కడ తాళం వేసిన ఇళ్లను గుర్తించేందుకు పగలు తన కారులో నగరంలో తిరిగేవాడు. ఈ ప్రాంతానికి కొత్త కావడంతో రాత్రి వేళ దారి మర్చిపోతానేమోనని ఆయా ఇళ్ల లోకేషన్లను గూగుల్ మ్యాప్స్‌లో గుర్తించేవాడు. అర్ధరాత్రి వేళ గూగుల్ మ్యాప్ సహాయంతో ఆయా ఇళ్ల వద్దకు వెళ్లి తన పని పూర్తి చేసుకునే వాడు. ఇలా వారం రోజుల్లోనే 10 ఇళ్లలో దొంగతనం చేశాడే. 25 లక్షల వరకు సొమ్ములు అపహరించాడు. కరీంనగర్ పోలీసులు చివరకు ఆ దొంగను అదే ఆధునిక టెక్నాలజీ ద్వారా పట్టుకుని కటకటాల వెనక్కినెట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రం లోని కొత్త బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తు పడితే 87126 56815 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని టౌన్ సీఐ కరుణాకర్ ఒక ప్రకటనలో కోరారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

చిగురుమామిడి,అగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన బల్ల బాలయ్య (55) అనే వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం ఉరి వేసుకొని అత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలయ్య అనేక ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు పెరుగడంతో వాటిని తట్టుకోలేక మానసిక ఒత్తిడికి లోనై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వెసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంక మండలం కోర్కల్ గ్రామ శివారులో నుంచి శంకరపట్నం మండలంలోని లింగాపూర్ గ్రామం మీదుగా హుజూరాబాద్‌కు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ సుద్దాల దేవుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దంపేట గ్రామ శివారులో తారు రోడ్డుపై జక్కుల కుమార్‌కు చెందిన కేజ్‌వీల్స్ టీఎస్ 2250 ట్రాక్టర్‌ను నడుపుకుంటు వెళుతున్నాడు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించారు. ఎవరైనా తారురోడ్డుపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపిస్తే జరిమానాలతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 52మంది మందుబాబులకు మంగళవారం జరిమానా విధిస్తూ సిరిసిల్ల రెండవ శ్రేణి మెజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సిఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలో 14రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 52మంది మందుబాబులు పట్టుబడ్డారు. వీరికి ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించవాహనాలు నడపమని ప్రతిజ్ఞచేయించారు. అనంతరం 52మందిని కోర్టులో హాజరుపరచగా 14మందికి రూ. 4వేలు, 38మందికి ఒక్కొక్కరికి రూ. 1000 జరిమానా విధించారు. 52మందికి మొత్తం రూ. 94వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా రోడ్డు ప్రమాదం

● ఒకరి మృతి .. ఆరుగురికి గాయాలు ● దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన



నరేష్ (ఫైల్)



ప్రమాదానికి గురైన కారు



చికిత్స పొందుతున్న విద్యార్థి

కోరుట్ల రూరల్, అగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గాడిపల్లి నరేష్ దుబాయ్‌లో ట్రక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం కొమురవెల్లి, యాదగిరిగుట్ట, వేములవాడకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇంకో రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా మంగళవారం తెల్లవారుజామున వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డుపక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టగా నరేష్(35) అక్కడికక్కడే మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నారు.

గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడిపల్లి నరేష్ అతని భార్య శిరీష ఇద్దరు పిల్లలు కార్తిక, విహాన్, అతని స్నేహితుడు బొల్లంపల్లి శ్రీనివాస్-సుజాత దంపతులతో పాటు కూతురు జశ్వితలతో కలిసి సోమవారం ఉదయం కొమురవెల్లి, యాదగిరిగుట్ట, వేములవాడ దైవదర్శనానికి కారులో వెళ్లారు. దైవదర్శనం చేసుకొని వేములవాడ మీదుగా కోరుట్ల మండల అయిలాపూర్ సమీపానికి చేరుకున్న వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న గాడిపల్లి నరేష్ అక్కడికక్కడే మృతి చెందగా, అతని భార్య శిరీషకు రెండు చేతులు విరిగాయి. శ్రీనివాస్‌కు వెన్ను భాగంలో గాయాలయ్యాయి. శ్రీనివాస్ భార్య సుజాత కాలు విరిగిపోగా ముగ్గురు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద విషయాన్ని శ్రీనివాస్ గ్రామస్థులతో పాటు పోలీసులు, అంబులెన్స్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న గ్రామస్థులు ప్రత్యేక వాహనం ద్వారా క్షతగాత్రులను కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రత్యేక వాహనం ద్వారా జగిత్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. నరేష్ కారు నడుపుతున్న సమయంలో సీట్ బెల్ట్ పెట్టుకోకపోడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. పక్కన కూర్చున్న శ్రీనివాస్ సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు ప్రమాదానికి నిద్రమత్తే కారణమని తెలుస్తోంది. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ చిరంజీవి పరిశీలించారు. మృతుడు నరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. 8 మంది విద్యార్థులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో మంగళవారం కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై కుక్కలను తప్పించబోయిన ఆటో బోల్తా పడింది. రాచర్లగొల్లపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మలాంగ్ 8 మంది విద్యార్థులను వాహనంలో ఎక్కించుకుని ఎల్లారెడ్డిపేట శివారులోని ప్రైవేటు పాఠశాల వైపు వెళుతుండగా కుక్కలు అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8 మంది విద్యార్థులు గాయపడ్డారు. గాయపడిన వారిలో మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్‌తండాకు చెందిన పదో తరగతి విద్యార్థులు హర్షద్, కైఫ్, వైభవ్, నందిని, శరణ్య, కుశాల్, వాజీద్, రాజేశ్వర్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల్లో హర్షద్ కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి డీఈవో వినోద్, జిల్లా వైద్యాధికారి రజిత, ఎంఈవో కృష్ణహరి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటపొలాల్లోకి దూసుకెళ్లిన కారు

మల్యాల: మండలంలోని రామన్నపేట-రాంపూర్ గ్రామాల మధ్య ఓ కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఓగులాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల మనోజ్ కారులో గంగాధర మండలం నుంచి వస్తుండగా రామన్నపేట గొల్లపల్లె దాటిన తరువాత మూలమలుపు వద్ద కారు వేగంగా ఉండడంతో అదుపుతప్పి వరి పంటలలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో కారులో గల మనోజ్ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య



శ్రావ్య (ఫైల్)

శంకరపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామంలో భర్త వేధింపులు భరించలేక భార్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన శ్రావ్య (27)కు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి గ్రామానికి చెందిన అమ్మిగల్ల ధర్మతేజతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. వారి మధ్య మనస్పర్థలు రావడంతో గత రెండేళ్ల నుంచి శ్రావ్య తన తల్లిగారి గ్రామం తాడికల్‌లో ఉంటోంది. భర్త ధర్మతేజ్ మానసికంగా వేధిస్తూ అవమానిస్తూ ఉండడంతో మనస్థాపానికి గురై తాడికల్‌లోని తన తల్లిగారి ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున ఉరేసుకొని మృతి చెందింది. మృతురాలి సోదరుడు గొట్టె శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



సురేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ముగ్ధం సురేష్(29) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. కొంత కాలంగా సురేష్ మద్యానికి బానిసై పనిచేయక ఖాళీగా తిరుగుతున్నాడు. కుటుంబాన్ని పోషించే విషయంలో తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. పనిచేయకుండా అందినకాడికి అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో సురేష్ సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతిచెంచినట్లు తెలిపారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణం పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

సైదాపూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట గ్రామ శివారులోగల సర్వాయి పాపన్న గుట్టల వద్ద నర్మిస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఆదేశించారు. మంగళవారం ఆమే పాపన్న గుట్టలను సందర్శించి పర్యాటక కేంద్రంలో బాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పర్యాటక శాఖ డీఈ నటరాజ్ పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహం ధ్వంసం



పరిశీలిస్తున్న పోలీసులు

రాయికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూటపల్లి గ్రామ శివారులోని చిరుతల ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు హనుమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. వాగు సమీపంలో ఉన్న ఈ గుడిలో గ్రామస్థులు చాలా ఏళ్లగా పూజలు నిర్వహిస్తున్నారు. అయితే మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లిన గ్రామస్థులకు హనుమాన్ విగ్రహం ధ్వంసమై ఉండటం, ఆలయ ఆవరణలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుధీర్‌రావు తన సిబ్బందితో వెళ్లి విచారణ జరిపారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై త్వరలో నిందితులను పట్టుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- వృద్ధుడిని హత్య చేసిన తండ్రీకొడుకులు
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ అనిల్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మెటపల్లి సీఐ వి అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన నానం చిన్న హన్మండ్లు, అతని కుమారుడు నానం రాకేష్ సకినపల్లి కాశీం(62) అనే వృద్ధుడిని కర్రలతో బాది హత్య చేశారు. 15 సంవత్సరాల క్రితం కాశీం భూమి పక్కన చిన్న హన్మండ్లు కొంత భూమిని కొనుగోలు చేశాడు. అందులో ఉన్న పాత వ్యవసాయ బావిని పూడ్చి ఆక్రమించుకోవడానికి నిందితులు ప్రయత్నించగా సకినపల్లి కాశీం అడ్డుపడ్డాడు. దీంతో వారి మధ్య తరచుగా గొడవలు జరుగుతుండేవి. కాశీం తన స్థలంలో బాత్రూం నిర్మించుకోగా, నిందితులు అది తమ స్థలంలో నిర్మించారని ఆరోపిస్తూ అడ్డుపడ్డారు. ఈ వివాదంపై గతంలో పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా పరిష్కారం కాలేదు. దీంతో తండ్రీకొడుకులు ఎలాగైనా కాశీంను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. కాశీం ఈ నెల 2న రాత్రి సమయంలో తన పెద్ద కొడుకు లక్ష్మీనరసయ్య ఇంట్లో భోజనం చేసి నడుచుకుంటూ వస్తుండగా రోడ్డుపై అడ్డగించి దాడి చేశారు. కర్రతో అతని తల, ముఖంపై, చాతీపై బలంగా కొట్టారు. తీవ్ర రక్తస్రావంతో కాశీం అక్కడికక్కడే మరణించాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. మృతుడు కాశీం పెద్ద కొడుకు సకినేపల్లి లక్ష్మీనరసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు హన్మండ్లు ఊరిలోని ఓ పెద్ద మనిషికి ఫోన్ చేసి తామే హత్య చేసినట్లు చెప్పడంతో పోలీస్‌లు నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆగస్టు 4న గోధూర్ రోడ్డు సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నేరం అంగీకరించడంతో వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కర్ర, మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడలో జెట్టి మాన్విక్ అనే మూడు సంవత్సరాల బాలుడిపై వీధి కుక్కలు మంగళవారం దాడి చేశాయి. ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడి తల, మెడ, గొంతుపై కుక్కలు కరవడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడికి తీవ్ర గాయలు కావడంతో ప్రథమచికిత్స చేసి నిజామాబాద్ అసుపత్రికి తరలించారు. నెల రోజుల క్రితం కుక్కలు పట్టణంలో తొమ్మిది మంది విద్యార్థులను కరిచాయి. దీంతో మున్సిపల్ అధికారులు తూతూ మాత్రంగా కుక్కలను పట్టుకొని తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు రెండురోజులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కుక్కల బెడదల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

గన్నేరువరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పంటలను సాగు చేసుకున్న రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంకు మంగళవారం 450 బస్తాల యూరియా రావడంతో సమాచారం అందుకున్న రైతులు ఉదయం నుంచి భారీగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. గంటల తరబడి నిరీక్షించినప్పటికీ కొంమందికి మాత్రమే యూరియా బస్తాలు దొరకగా మిగిలిన వారు నిరాశతో వెనుదిరిగారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సొసైటీ వద్ద పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. వెంటనే సరిపడా యూరియా అన్ని గ్రామాల్లోని ఎరువుల దుకాణాలకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మౌంట్ ఎల్బ్రోస్‌ను అధిరోహించిన తండ్రీకొడుకులు



మౌంట్ ఎల్బ్రోస్ పర్వతంపై బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న తండ్రీకొడుకులు మల్లారెడ్డి, వివేకానందరెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యూరప్ ఖండంలోని ఎత్తయిన శిఖరం మౌంట్ ఎల్బ్రోస్ పర్వతాన్ని(18,150 అడుగుల) పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన లెంకల మహిపాల్ రెడ్డి, అతని కుమారుడు వివేకానంద రెడ్డిలు అధిరోహించారు. పర్వతారోహణకు గత నెల 28న రష్యాకు వెళ్లి ఐదు రోజుల శిక్షణ అనంతరం ఈ నెల 3న అధిరోహించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా అక్కడ సే నోటుడ్రగ్స్ అనే బ్యానర్‌ను ఆవిష్కరించారన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వారిని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ లెంకల మహిపాల్ రెడ్డి మాజీ సైనికుడిగా ఇప్పటికే 12 పర్వతాలను అధిరోహించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించారన్నారు. వివేకానందరెడ్డిని కూడా పర్వతారోహణ చేయాలనే ఉద్దేశ్యంతో తండ్రి మహిపాల్‌రెడ్డి వద్ద ఏడాదిగా శిక్షణ పొందారని తెలిపారు. మరిన్ని పర్వతాలను అధిరోహించి దేశానికి పేరు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

శిథిలావస్థలో మ్యూజియం



మ్యూజియంలోని పురా వస్తువులు

- పట్టించుకునేవారు కరువు
- భవన నిర్మాణం చేపట్టాలని వినతి
- నామ మాత్రంగా కరీంనగర్ జిల్లా పర్యాటక శాఖాధికారి పోస్టు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లోని ప్రభుత్వ పురావస్తుశాఖ మ్యూజియం శిథిలావస్థకు చేరుకుంది. ఉత్తర తెలంగాణలోని మూడు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర పురావస్తు శాఖ సహాయ సంచాలకుల కార్యాలయ భవనాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. యాభై ఏళ్ల దాటిన భవనాలు మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఎప్పుడు కూలుతాయోనని భయాందోళన నెలకొంది.

● మ్యూజియం... భవనాల లెక్కలు

1969లో అప్పటి విద్యాశాఖ మంత్రి పీవీ నరసింహారావు ప్రత్యేక చొరవతో 20 గుంటల ప్రభుత్వ స్థలంలో మ్యూజియం, కార్యాలయ భవనాల నిర్మాణాలు చేపట్టారు. మ్యూజియంపైన సహాయసంచాలకుల కార్యాలయం ఉంది. అర ఎకరంలో ఉన్న ఈ మ్యూజియం స్థలంలో సుమారు ఐదు గుంటలు 2013లో కమాన్ నుంచి ముఖరంపుర వరకు జరిగిన రోడ్ వెడల్పులో హరించుకపోయిందని, ప్రస్తుతం 15 గుంటల వైశాల్యంలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీని విలువ గుంటకు కోటి రూపాయలు చూసుకున్నా మార్కెట్‌ధర ప్రకారం 15 కోట్ల స్థలంగా భావిస్తున్నారు. రెండస్థుల ఈ మ్యూజియంలో ఖాళీ స్థలం 70 శాతం ఉంది. స్తంభాలు లేని భవనాలు కావడంతో వర్షాలకు నానుతూ, ఎండకు ఎండుతూ ఉన్నాయి.



మ్యూజియం ముఖద్వారం

● ఏళ్లు గడుస్తున్నా.. ఆచరణ శూన్యం

మ్యూజియంను ఆనుకొని ఉన్న కలెక్టర్ బంగ్లాను కలుపుకొని నూతన భవనాలు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ఏళ్లు గడుస్తున్నా ఆచరణ సాధ్యం కావడం లేదు. అధికారులు, నాయకులు సందర్శించినా మరమ్మతుకు నోచుకోలేదు. వెయ్యి కోట్ల స్మార్ట్ సిటీ పథకం కింద ఎన్నో ప్రభుత్వ భవనాలు చేర్చినా పురావస్తు శాఖ భవనాలకు నిధులు కేటాయించలేదు. ఇప్పటికైనా కొత్త మ్యూజియం భవనం నిర్మించాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

● నిర్వహణ భారం

పురావస్తు శాఖ శాఖలో నిధులు, సిబ్బంది కొరతతో మ్యూజియం, కార్యాలయాల నిర్వహణ భారంగా మారింది. ఏడాదిన్నర నుంచి ఇన్‌చార్జిగా ఉన్న జిల్లా పర్యాటక శాఖాధికారి పోస్టును నామమాత్రం చేసి నెహ్రూ యువ కేంద్రం అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. మ్యూజియానికి అనుబంధంగా ఉన్న చారిత్రాత్మక కట్టడాలు, సాంస్కృతిక, పర్యాటక కేంద్రాలను, చిహ్నాలను కూడా పురుద్ధరించాల్సిన అవసరం ఉంది.

మ్యూజియంలో విలువైన పురావస్తు సంపద..

మ్యూజియంలో లక్ష సంవత్సరాల పాతరాతి యుగం ఆనవాళ్లు ఉన్నాయి. చరిత్రకారుడు ఠాకూర్ రాజారాంసింగ్ సేకరించిన ఆదిమ మానవుల రాతి పనిముట్లు భద్రపరిచారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న శాతవాహనుల కోటి లింగాల బౌద్ధ స్థూప ఖండికలు, లఘు శాసనాలు, నాణేలు దర్శనమిస్తాయి. వేములవాడ, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, పొలవాస రాజుల కాలం నాటి శిలా, రాగి శాసనాలు ఉన్నాయి. శాతవాహనుల మొక్కట్‌రావుపేట శాసనాలు, పాశిగాం బౌద్ధ స్తూపం, మధ్యయుగం నాటి శిలా, బౌద్ధ జైన, నాగిని, యుద్ధవీరుల విగ్రహాలు కనిపిస్తాయి. ఇత్తడి కళా ఖండాలు, పీటీ రెడ్డి పేయింటింగ్స్, గుర్రాల బొమ్మలు, కుతుబ్‌షాహిలు, మొఘలాయిలు, నైజాం కాలం నాటి పింగాణీ వస్తువులు ఆకట్టుకుంటాయి. 150 ఏళ్ల ఇచ్చంపల్లి ప్రాజెక్ట్ ఇంజనీయర్ ఫ్రెంచ్ అధికారి సమాధి ఫలకం, కత్తులు, బౌద్ధప్రతిమలు, ప్రతాపరుద్రుడు, ధర్మపురిలో సేకరించిన ఆంజనేయస్వామి, వేములవాడలో సేకరించిన గాయత్రీ విగ్రహాలు కనిపిస్తాయి. ధూళికట్ట బౌద్ధ స్తూప ఫలకలు, తెలుగుకు ప్రాచీన హోదా తెచ్చిన కురిక్యాల బొమ్మలగుట్ట త్రిభాషా శాసనం, జగిత్యాల, ఎలగందుల, కాళేశ్వరం శిలా విగ్రహాలు మ్యూజియం పరిధిలో ఉన్నాయి.



మ్యూజియంలోని బౌద్ధ పలకలు

బ్యాంకు అవకతవకలపై చర్చకు సిద్ధమా?

● అర్బన్ బ్యాంకు చైర్మన్ విలాస్ రెడ్డి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకులో 2007 నుంచి 2017 వరకు కొనసాగిన పాలకవర్గం అవకతవకలపై చర్చకు సిద్ధమా అని అర్బన్ బ్యాంకు చైర్మన్ విలాస్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభ్యత్వాల రద్దు విషయంలో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ ఆరోపణలు అవాస్తవమన్నారు. బ్యాంకు సర్వసభ్య సమావేశం 1964 సహకార చట్టం ప్రకారం జరిగిందని, ఒకసారి కోరం లేక వాయిదా వేస్తే అదే సభను తిరిగి ఏరోజైతే సభ ఉంటుందో అదేరోజు సభ నిర్వహించుకునే హక్కు ఉంటుందని అన్నారు. 2009లో కళాభారతిలో నిర్వహించిన మహాసభకు 1780 మంది హాజరయ్యారని తప్పుడు రికార్డు సృష్టిస్తూ బైలాను మార్చారని, కళాభారతిలో 300 మంది కెపాసిటీ ఉంటే 1780 మందిని ఎక్కడ కూర్చోబెట్టారని ప్రశ్నించారు. నకిలీ బంగారం విషయంలో కిందివారిపై చర్య తీసుకోకుండా అప్పుడున్న సీఈవోను సస్పెండ్ చేశారన్నారు. బ్యాంకు సభ్యత్వాలను లెడ్జర్‌లో దిద్దడం, అవకతవకలకు పాల్పడడంపై అధికారులు విచారణ జరిపి ఇచ్చిన నివేదిక మేరకు కోర్టు ఆనాటి 15 మంది పాలకవర్గ సభ్యుల శాశ్వత సభ్యత్వాన్ని తొలగించాలని ఆదేశాలు ఇచ్చిందని, వారి సభ్యత్వాలను రద్దు చేశామని తెలిపారు. గత పాలకవర్గం హయాంలో 15 వేల మంది సభ్యులను చేర్పించారని, అకౌంట్ లేనప్పటికీ సభ్యత్వాలు ఇచ్చారని అన్నారు. సమావేశంలో మడుపు మోహన్, ముక్క భాస్కర్, విద్యాసాగర్, మార్క రాజు ఉన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

బ్యాంకు పరువు తీసేలా చైర్మన్ వ్యాఖ్యలు

- అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకు పీఏసీ కమిటీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు బ్యాంకు పరువును బజారుకీడ్చే విధంగా ఉన్నాయని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ అన్నారు. మంగళశారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2007 నుంచి 2015 వరకు చైర్మన్‌గా, 15 మంది సభ్యులతో పాలకవర్గంగా పనిచేశామని గుర్తుచేసిన విలాస్‌రెడ్డి తమ పాలనపై ఇప్పుడెందుకు ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. గత నెల 27న జరిగిన జనరల్ బాడీ సమావేశం కోరం లేక వాయిదా పడిందని, ఈ నెల 3న మరోసారి 208 మంది సభ్యులతో సమావేశం పెట్టినా అదే పరిస్థితి ఎదురైందని అన్నారు. సహకార చట్టం ప్రకారం ఈ సమావేశాలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. తమపై ఇప్పటి వరకు ఎలాంటి చట్టబద్ధమైన విచారణ జరగలేదని పేర్కొన్నారు. 1982లో బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి 25 ఏళ్లలో 24 కోట్లు మాత్రమే డిపాజిట్ కాగా, తమ పాలనలోనే 60 కోట్ల డిపాజిట్లు వచ్చాయని వివరించారు. 2017 తర్వాత 8 ఏళ్లలో కేవలం 10 కోట్లు మాత్రమే పెరిగాయన్నారు. విలాస్ రెడ్డికి సభ్యత్వాలు రద్దు చేసే హక్కు లేదని, కోర్టు ఆర్డర్ వస్తే అక్కడ తేల్చుకుంటామని అన్నారు. సమావేశంలో మాజీ పాలకవర్గ సభ్యులు బాశెట్టి కిషన్, వరాల జ్యోతి, లక్ష్మణ్ రాజు, అనరాసు కుమార్, సాయికృష్ణ, క్రాంతి, తాడ వీరారెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్

ఎస్సారెస్పీలో 40.304 టీఎంసీల నీరు

● 2,850 క్యూసెక్కులు రాక

జగిత్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి వరద నీరు రావడం కొనసాగింది. డ్యామ్ లోకి 4,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు ప్రస్తుతం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 793 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.204 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

ఎల్లంపల్లి నీటిని సిద్ధిపేట తరలిస్తుంటే ఏం చేశారు?

● పదేళ్లలో నీళ్ల వాటా సాధించనోళ్లు ఇప్పుడు గేట్లు బద్దలు కొడతారట ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గోదావరిఖని, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన అల్లుడు హరీష్‌రావులు ఎల్లంపల్లి నుంచి నీటిని సిద్ధిపేట, గజ్వేల్‌కు తీసుకెళుతుంటే నోరుమెదపని కొప్పుల ఈశ్వర్ ఇప్పుడు కన్నెపల్లి గేట్లు బద్దలు కొడతానని చెబుతున్నాడని రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిలక్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లంపల్లి కట్టినప్పుడు తుమ్మిడిహెట్టి వద్ద నుంచి కాలువలు తవ్వినప్పుడు ఈశ్వర్ ఎమ్మెల్యేనని, కాళేశ్వరం కట్టినప్పుడు మంత్రిగా ఉన్నాడన్నారు. మేడారం ఎమ్మెల్యేగా రామగుండం రైతుల ప్రయోజనాల కోసం నోరుమెదపలేదని, ఉమ్మడి జిల్లా రైతాంగానికి నీటి గురించి మాట్లాడలేదన్నారు. అదనపు టీఎంసీ పేర ధర్మపురి నియోజకవర్గంలో భూ సేకరణకు రూ.8లక్షలు, చొప్పదండిలో ఎకరానికి రూ.20లక్షలు ఇచ్చారన్నారు. కూలిపోయిన ప్రాజెక్టులో నీళ్లు నిల్వ చేస్తే ప్రాజెక్ట్ కొట్టుకుపోతుందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చిందని, అలాగే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో కూడా పగుళ్లు, లీకేజీలు ఉన్నట్టు చెప్పిందన్నారు. కన్నెపల్లి నుంచి నీటిని తరలించి బ్యారేజీల్లో నీరు నింపడం కూడా ప్రమాదకరమని ఎన్‌డీఎస్‌ఏ చెబుతుందన్నారు. కేంద్ర నిపుణుల కమిటీ సూచన మేరకు రెండు మూడు నెలల్లో బ్యారేజీల మరమ్మతు చేస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసం కట్టారని, తుమ్మిడిహెట్టి వద్ద కట్టే అవకాశం ఉన్నా కట్టలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో నాగార్జున సాగర్, శ్రీశైలం, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు కట్టామని, అవి ఇప్పటికీ నాణ్యతగా ఉండి రైతాంగానికి నీరు ఇస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్‌లో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వాళ్ల హయాంలోనే కూలిందన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మరో కమలహాసన్ అని, ఆయన లోపల ఒక ఈశ్వర్, బయట ఒక ఈశ్వర్ ఉంటారని లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ చేసిన అప్పులకు ప్రతి నెల 6వేల కోట్లు వడ్డీలే కడుతున్నామని, కాళేశ్వరం కార్పొరేషన్ పేర ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకుల నుంచి అడ్డగోలుగా అప్పులు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పైసాపైసా పోగు చేసి ఉద్యోగులకు 1వ తేదిన వేతనాలు ఇస్తున్నామని, 2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామని, ప్రతి ఇంటికి సన్న బియ్యం, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 58వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదికలో కేసీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి బండారాన్ని బయట పెట్టారని, దీనిపై అసెంబ్లీ వేదికగా చర్చ పెడతామన్నారు. కాల్వలింగస్వామి, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, ముస్తాఫా ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిరిసిల్ల జిల్లాకు పతకాలు



పతకాలను అందుకుంటున్న అభిరామ్, ప్రేమ్‌కుమార్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హన్మకొండలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు మూడు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించారు. అండర్-20 హైజంప్ అభిరామ్, అండర్-16 విభాగంలో 80 మీటర్స్ హాడిల్స్‌లో మామిండ్ల రుచిత, అండర్-20 విభాగం షాట్‌పుట్‌లో అజ్మీరా ప్రేమ్‌కుమార్ రజత పతకాలను సాధించారు. అండర్-20 విభాగంలో 10కే వాక్‌లో శ్రీపతి విక్రమ్ కాంస్య పతకాన్ని సాధించాడు. జిల్లాకు రజత, కాంస్య పతకాలను సాధించిన క్రీడాకారులకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గొట్టె రాంచంద్రం, సంయుక్త కార్యదర్శి అజయ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కనకం శ్రీనివాస్ సభ్యులు హరీష్, గంగధార్, అశోక్, బాబు, నవీన్ అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు రాలేదని ఆత్మహత్యాయత్నం



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న దంపతులు

చిగురుమామిడి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు రాలేదని అదే గ్రామానికి చెందిన వంతడ్పుల శ్రీనివాస్-సృజన దంపతులు మంగళవారం నిరసన తెలిపారు. శ్రీనివాస్ కొంత పెట్రోల్ తాగి కొంత ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకోగా పెట్రోల్ డబ్బాతో రహదారిపై ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శ్రీనివాస్ -సృజన దంపతులను 108 అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితులు విలేకరులతో మాట్లాడుతూ తమకు పాత ఇళ్లు ఉందని ఎలాంటి ఆస్తిపాస్తులు లేవన్నారు. ఇందిరమ్మ ఇంటికి తాము అర్హులమైనా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇల్లు మంజూరు కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు విడుతల్లో ఇళ్లు రాకపోవడంతో గత్యంతరం లేక ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహ రించడంతో పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు వేడుకున్నారు.

ఘనంగా ఆదివరాహ జయంత్యుత్సవాలు

కమాన్‌పూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలు మంగళవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నిత్యాభిషేకంతోపాటు గోపూజను ఆలయ ప్రధాన అర్చకులు కలకుంట్ల వరప్రసాద్, ఆలయ ఈవో కాంతరెడ్డి, వేద పండితులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. మొదటి రోజు హవనము, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు స్వామి వారిని దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యూనివర్సిటీ ప్రగతికి న్యాక్ గుర్తింపు అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీని ప్రగతి పథంలో నడిపించాలంటే జాతీయస్థాయి నాక్ గుర్తింపు అవసరమని, దీంతో నాణ్యత పెరుగుతుందని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. నాక్ గుర్తింపులో భాగంగా నాక్ సంచాలకులు డాక్టరు శ్రీరంగ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సదుస్సులో మాట్లాడారు. అధ్యాపకులు మరింత పరిశోధన చేయడానికి తోడ్పడుతుందని, సదస్సును మరింత ఉపయోగకరంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం మౌలానా ఆజాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అభ్యాస ఆచార్యులు డాక్టర్ రమ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సంస్థాగత అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని అన్నారు. విశ్వవిద్యాలయ నాక్ సంచాలకులు శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులు నైపుణ్యాలు, అభ్యాసాలను పెంచుకోవాలనే ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉస్మానియా రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీపతిరావు ప్రొఫెసర్ వీర సోమయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, ఓఎస్డీ టు వైస్ చాన్సలర్ డాక్టర్ హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత, డాక్టర్ జయంతి పాల్గొన్నారు.

ఎస్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో హాస్టల్ వసతి

గణేశ్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హుస్నాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈ సంవత్సరం నుంచి బాలికలకు, బాలురకు వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పించనున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ, జనగాం నాలుగు జిల్లాల గ్రామీణ విద్యార్థులకు హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీ గొప్ప అవకాశమన్నారు. అత్యుత్తమ విద్య మౌలిక సదుపాయాలతోపాటు హాస్టల్ వసతి కల్పించడం ద్వారా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

మల్యాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించు కున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్య వేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

నరసింహుడి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి నరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ మంగళ వారం పెరిగింది. శ్రావణ మాసం పురస్కరించుకుని క్షేత్రానికి ఉద యం వరకు భారీగా భక్తులు తరలి వచ్చారు. అనంతరం గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు. అక్కడి నుండి స్థానిక లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



విష్ణు సహస్రనామ పారాయణం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో గల శేషప్ప కళావేదికపై శారదా మహిళా మండలి సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. శారదా మహిళా మండలి సభ్యులను ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ అభినందించారు.

శాకంబరీ దేవిగా మానసాదేవి

గన్నేరువరం: శ్రావణమాస వేడుకల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం ఖాసింపేట మానసాదేవి ఆలయంలో మంగళవారం మానసాదేవి శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలోని మానసాదేవి, అపురూప లక్ష్మి అమ్మవార్లతో ఆంజనేయ, శ్రీచక్రానికి కూరగాయలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు.

రాజారంలో జెండా పండుగ

మల్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పల్లెపల్లెకు కాంగ్రెస్ జెండా పండగ కార్యక్రమాన్ని మండలంలోని రాజారంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గ్రామస్థులకు వివరించారు. రాబోయో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో ఆనందరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఆదిరెడ్డి, రాజిరెడ్డి, తిరుపతి, సురేశ్, బక్కశెట్టి శ్రీనివాస్, గుర్రం శ్రీకాంత్, నేరెళ్ల సతీశ్‌రెడ్డి, చంద్రయ్య, బండి రవి, నాగులపేట సంజీవ్, కట్కం వినయ్, మారుతి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

గొల్లపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బహుజన సమాజ్ పార్టీ దర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క గంగాధర్ పిలుపునిచ్చారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ కార్యకర్తలందరూ గ్రామగామాన పార్టీ పటిష్ఠత కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బిరుదుల లక్ష్మణ్, కల్లెపెల్లి తిరుపతి మాసాల పోషయ్య, బెక్కం అంజయ్య, బొనగిరి అనిల్ కుమార్ సీపెల్లి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం.. ఔషధం

జగిత్యాలరూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు అమృతం, ఔషధం వంటిదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సెక్టార్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డలకు అమృతమని పేర్కొన్నారు. పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వాణిశ్రీ గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. గర్భిణుల సీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో రవీందర్, మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుసుమ, మౌనిక, అంగన్‌వాడి టీచర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాయికల్ (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు అమృతంతో సమానమని రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మన్, లయన్స్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ లయన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో 50 మంది బాలింతలు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డయాబెటిక్ జిల్లా కో ఆర్డినేటర్ బత్తిని భూమయ్య, రాయికల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, వాసం ప్రసాద్, వెంకట్ రెడ్డి, ప్రసాద్ సుదవేణి మురళి, సాంబారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మల్యాల మండలం మద్దుట్లలో అన్నప్రాసన చేస్తున్న టీచర్లు, తిప్పయ్యపల్లిలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మల్యాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దుట్లలో అంగనన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలు, ముర్రు పాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్ స్వరూపరాణీ తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల వరకు చిన్నారులకు తల్లి పాలు పట్టించాలని ఐసీడీఎస్ మల్యాల సీడీపీవో వీరలక్ష్మి సూచించారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలో గృహ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో తల్లి ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్ సునీత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని అంబారిపేటలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీవో వేణురావు, హెచ్‌వీ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, విజయలక్ష్మీ, గంగమణి, సరోజా, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'మెప్మా'లో ఇంటి దొంగలు

(5వ పేజీ తరువాయి)

రుణాలు మంజూరు చేయాల్సిన అధికారులు కేవలం మ్యానువల్ ఆధారంగానే పరిశీలన జరుపుతుండడంతో అక్రమాలు జరుగుతున్నట్లు అధికారుల విచారణలో గుర్తించారు.

● **రికవరీ జాడేది..?**

జిల్లాలో దుర్వినియోగం అయిన నకిలీ మహిళా సంఘాలు, సభ్యులకు చెందిన రుణాల రికవరీపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ తదితర మున్సిపాలిటీల్లో అవకతవకలు బయటపడినా ఇప్పటివరకు అరకొరగా మినహా రికవరీ జరగడం లేదు. ఇటీవల ఉన్నతాధికారులు జరిపిన సమీక్షలో రుణాలు చెల్లించడంలో జాప్యం చోటుచేసుకుంటుందని ప్రశ్నించినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. అయినా రికవరీపై అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కాగా రికవరీ సందర్భంగా బ్యాంకు అధికారులు, మెప్మా అధికారులు ప్రయత్నిస్తే అక్రమార్కులు బెదిరించడం, అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ పేరుతో కాజేసిన సొమ్ములో ఆర్పీలు ఎంతో కొంత చెల్లించి కేసులు, ఆరోపణల నుంచి బయటపడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఒకరిద్దరు ఆర్పీలకు అలవాటుగా మారినట్లుగా మెప్మావర్గాలు అంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు పకడ్బందీగా వ్యవహరించి రికవరీపై దృష్టి సారించాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మెప్మా అనుమతి లేకుండా రుణాల మంజూరు

- దుర్గపు శ్రీనివాస్ గౌడ్, మెప్మా ఏవో, జగిత్యాల



జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇతర కొన్ని బ్యాంకుల్లో నకిలీ సంఘాలతో పొందిన రుణాలకు మెప్మా నుంచి ఎలాంటి అనుమతి పొందకుండానే మంజూరు చేశారు. మెప్మా టీఎంసీ ఆమోదంతో రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. నకిలీ సంఘాలు సృష్టించి రుణాలు పొందినట్లుగా అనుమానిస్తున్నాము. పలు మున్సిపాలిటీల్లో గతంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై దృష్టి సారించాము. నకిలీపత్రాలు సమర్పించి బ్యాంకుల నుంచి పొందిన రుణాల రికవరీకి ప్రయత్నిస్తున్నాము. సాధ్యమైనంత వరకు రుణాలు రికవరీ చేస్తాము. అక్రమార్కుల వ్యవహారాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాము.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకుంటూ, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, హైకోర్టు న్యాయవాది మౌనిక సుంకర అన్నారు. జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌ళ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మౌనిక మాట్లాడుతూ మన ధర్మం, సంస్కృతులకు ఆధారమైన విద్యను, విజ్ఞానాన్ని గుర్తుచేసేదే రాఖీ పండగ అన్నారు. అనంతరం ఒకరికొ కరు రాఖీలు కట్టుకొని సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదుగంటి ఉమారాణి, భీమనాతి ఉమా, డాక్టర్ మృదులారెడ్డి, కాలువ సునంద, ఒడ్నాల రజిత, వాణిశ్రీ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, నగర అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్‌కుమార్, జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్‌కుమార్, జిల్లా కార్యదర్శి కస్తూరి రాజన్న, నగర కార్యదర్శి ఎదురుగట్ల పరంధామ్, భజరంగ్‌దళ్ నగర సంయోజక్ పాదం మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది మౌనిక, పాల్గొన్న విద్యార్థులు, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

రాయికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్‌రావు అన్నారు. రాయికల్ పట్టణంలోని మార్కండేయ పద్మశాలి సంఘ భవనంలో జేఏసీ ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గానికి మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణచారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, అల్లెరాము, సంయుక్త కార్యదర్శి గుర్రం చంద్రశేఖర్, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు, రాయికల్ ప్రెస్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

జగిత్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనుమతి లేకుండా పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసానికి గురిచేసిన శ్రీచైతన్య యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని కోరుతూ డీఈవో రాముకు మంగళవారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవో రామును కలిసి సమస్యను విన్నవించారు. ఎటువంటి అనుమతి లేకుండా పాఠశాలను నిర్వహించిన యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ న ఆయకులు భరత్, రాంచంద్ర, సంజయ్, ప్రేమ్‌కుమార్, ఆసిఫ్, నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా మంగళ గౌరీ వ్రతం

కోరుట్ల, అగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ వద్ద గల దుర్గాదేవి ఆలయంలో మంగళ గౌరీ వ్రతంను వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ, వినయ్ శర్మ, శుక్ల మత్రోత్చరణ మధ్య మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవలంయలో అమ్మవారికి అర్చన, అభిషేకాలను నిర్వహించారు. సామూహిక మంగళ గౌర వ్రతం ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు కంకుమ, పుసుపు పంచుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ మాజీ కౌన్సిలర్ పెండ గణేష్, ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.

మున్సిపల్ అక్రమార్కుల గుండెల్లో విజిలెన్స్ గుబులు

మున్సిపల్ రికార్డులు స్వాధీనం చేసుకున్న అధికారులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అవినీతికి అడ్డాగా మారిన జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో గతంలో పని చేసిన, ప్రస్తుతం పని చేస్తున్న అవినీతి అధికారుల గుండెల్లో విజిలెన్స్ అధికారుల విచారణ దడ పుట్టిస్తోంది. అవినీతి అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం సోమవారం జగిత్యాల మున్సిపల్‌లో తనిఖీలు నిర్వహించింది. మున్సిపాలిటీలో అవినీతిపై అందిన ఫిర్యాదులతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమకు వివరాలు అందజేయాలని పలుసార్లు మున్సిపల్ అధికారులను కోరినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాదానం రాకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు రిమాండర్ పంపించి సోమవారం విచారణ చేపట్టారు. జగిత్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న అధికారులపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో పాటు ముడుపులు పుచ్చుకుని ఇబ్బడిముబ్బడిగా ఇచ్చిన భవనాల అనుమతులు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు అవినీతి ఆరోపణలకు సంబంధించిన పలు రికార్డులను స్వాధీనం చేసుకుని తమ వెంట తీసుకువెళ్లినట్లు సమాచారం. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి వచ్చిన పిర్యాదులతో సంబంధం ఉన్న అధికారులపై త్వరలో చర్యలకు అధికారులు సిద్ధపడినట్లు తెలుస్తున్నది. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో తారా స్థాయిలో అవినీతి జరిగినట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం.

విశ్లేషణ చార్టుల ప్రదర్శన

కొడిమ్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, మహాత్మా జ్యోతిబాపూలే కరీంనగర్ వ్యవసాయ బాలికల కళాశాల విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ సదస్సులో భాగంగా కృషి అనుభవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామ జనాభా, ప్రజలు నిర్వహిస్తున్న పనులు, గ్రామసమస్యలు తదితర అంశాలపై చార్టులను ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన భక్తులు

మల్యాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన భక్తులు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆర్మూర్‌లోని శ్రీరాం నగర్ కాలనీకి చెందిన జమ్మలగిరి విరాఠమ్మ-గంగారాం దంపతులు రూ.3.60లక్షలతో బేతాళుడి ఆలయం పక్కన ఏర్పాటు చేయగా భక్తులకు మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చింది.

● **అన్నదానానికి సరుకుల వితరణ**

కొండగట్టులో భక్తులకు నిత్యం వంద మందికి గాను అన్నదానానికి అవసరమయ్యో సరుకులను ఏడాది పాటు అందించడానికి కరీంనగర్‌కు చెందిన బండారి మారుతీ (ఎస్ఆర్‌కే డెయిరీ) ముందుకు వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు.

రైతు బీమా చెక్కులు అందజేత

ధర్మపురి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామంలో రైతుల కుటుంబ సభ్యులకు రైతు బీమా చెక్కులను టీపీసీసీ సభ్యుడు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ గ్రామంలో గోల్ల సత్తయ్య, గొడిసెల సతీష్ అనే ఇద్దరు రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా వారికి ఐదు లక్షల చొప్పున మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఈవో అజయ్‌కుమార్, యవజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రాందేని మొగిలి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి అభినందనీయం

కొడిమ్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి సింగిల్ విండో పాలకవర్గం కృషిచేయటం అభినందనీయమని జిల్లా వ్యవసాయాధికారి వి బాస్కర్ అన్నారు. మండలంలోని తిర్మాలాపూర్ రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి బాస్కర్ పాల్గొన్నారు. తిర్మాలాపూర్ రైతు వేదికకు సీసీ కెమెరాలను విరాళంగా అందించిన తిర్మాలాపూర్ సింగిల్ విండో పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్, ఉపాధ్యక్షుడు సురేష్‌రావును సన్మానించారు. అనంతరం సింగిల్ విండో ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమాల్లో ఏడీఏ టెక్నికల్ రాజుల్ నాయుడు, ఏవో పి జ్యోతి, ఏఈవోలు రాజేష్, గ్రీష్మ, శ్రీలత, ప్రశాంత్, మాజీ ఎంపీటీసీలు మల్లేశంయాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జగిత్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవో హకీంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు యూటీఎఫ్ నాయకులు మాట్లాడారు. టీచర్ల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసిన ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించిన ఖాళీలలో శాశ్వత నియామకాలు చేపట్టాలన్నారు. జూనియర్ లెక్చరర్ పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్లకు 40 శాతం వాటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్, పలువురు రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భౌతికశాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్, సోహం అకాడమీ సంయుక్తంగా జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రోబోటిక్స్‌పై ఒక్క రోజు వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ పలువురు సీనియర్ ఫిజిక్స్ విద్యార్థులు ట్రైనర్లుగా విచ్చేసి 74 మంది మహిళా కళాశాల విద్యార్థులకు రోబోటిక్స్‌పై అనుభవాత్మక శిక్షణను ఇచ్చారన్నారు. పాఠ్యపుస్తకాల్లోని జ్ఞాన సముపార్జననే కాకుండా దాని వినియోగం, విశ్లేషణ సామర్థ్యాలను ప్రదర్శన ద్వారా పరిపూర్ణంగా పెంపొందించుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి రామంచంద్రం, సీనియర్ లెక్చరర్లు డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, డాక్టర్ వాసాల వరప్రసాద్, చంద్రయ్య, సైన్స్ ఉపాధ్యాయులు సత్యం తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఉపాధ్యాయులను నియమించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న తపస్ నాయకులు

ధర్మపురి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని టీపీయూఎస్(తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన్‌పెల్లి ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల, తుమ్మెనాల, రాయపట్నం తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కలుస్తూ తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రావు మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆరోగ్య భద్రతా కార్డులు అందించాలని కోరారు.

జీపీఎస్, పార్ట్ ఫైనల్, రిటైర్‌మెంట్ బెనిఫిట్లతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యా య, విద్యారంగ సమస్యలను ఎమ్మెల్సీల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి మహేష్, ధర్మపురి మండల అధ్యక్షుడు కాశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడిపెల్లి సత్యనారాయణ అన్నారు. బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన పసుపు బోర్డును నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ సాధించారని తెలిపారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ జవహర్ నవోదయ విద్యాలయాన్ని కోరుట్ల నియోజక వర్గానికి మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలల గడుస్తున్నా ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి శ్రీనివాస్, ఏలేటి నరేందర్‌రెడ్డి, నాయకులు పీసు రాజేందర్‌రెడ్డి, బత్తిని శంకర్‌గౌడ్, గుంటుక సదాశివ్, చిలివేరి మల్లేష్, మెడిచేల్మల రవి, నవీన్, మహేష్, రాజేష్, జిన్నా, రాజేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో కరపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం పెరుకపల్లి, రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామాల్లో మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నలువాల తిరుపతి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రధాన మంత్రి మోదీ చేస్తున్న అభివృద్ధి పథకాలను కరపత్రాలు ద్వారా వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇట్నేని రమేష్, గడ్డం రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, జిల్లా కోశాధికారి దశరథరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు గంగారాం, నాయకులు రాపర్తిరాజు, కాయితి శంకర్, నలువాల నరేందర్, బాపురపు శేఖర్, ఎనుగందుల ఉమాపతి, బగ్గని లింగన్న, బొడ్డు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని మల్యాల, గొల్లపల్లి, బల్వంతాపూర్, మానాల, ముత్యంపేట గ్రామాల్లో బీజేపీ-ప్రతిఇంటికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, కెల్లెటి రమేశ్, రాజశేఖర్, రమ, గౌతం, లత, సామ మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్, గుర్రం శ్రీధర్, రాఘవేంద్ర, మల్లేశం, చిరంజీవి, వామన్ పాల్గొన్నారు

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ పాలనలో నిరుపేదలకు న్యాయం జరుగుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి పేర్కొన్నారు. మండలంలోని సిరికొండలో మంగళవారం కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ బలపరిచే అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బూత్‌స్థాయిలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సిరిమల్లె శేఖర్, గాంధారి శ్రీనివాస్, సత్యనారాయణ, బద్రి సత్యం, కాశోజీ ప్రతాప్, వొడ్డాటి సునీల్, గుండేటి జనార్దన్, శ్రీకర్ తదితరులు ఉన్నారు.

వ్యాధుల సర్వేను నిర్వహించాలి

కొడిమ్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా ప్రజలకు సంక్రమించే వ్యాధులను గురించి నిత్యం గ్రామాల్లో సర్వే చేయాలని జిల్లా ఉపవైద్యాధికారి ఎన్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ నిత్యం లార్వా, టీబీఎంబీ సర్వేను నిర్వహించడంతో వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరేష్, పరమేశ్వరీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, సూపర్‌వైజర్లు వెంకట నర్సమ్మ, అలివేలు, శ్రీనివాస్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల బారిన పడవద్దు

కొడిమ్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన ఎవ్వరు పడవద్దని హెడ్‌కానిస్టేబుల్ సౌందర్య కోరారు. మండల కేంద్రంలోని ప్రజలకు సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ అపరిచిత ఫోన్‌నంబర్లను లిఫ్ట్ చేయవద్దని సూచించారు. ఫోన్ కాల్‌తో గుర్తుతెలియని వారు ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో గ్రామస్థులు గంగన్న, లచ్చిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కథలాపూర్: మండల కేంద్రంలో మంగళవారం లయన్స్‌క్లబ్ సెకండ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ గుంటుక చంద్రప్రకాశ్ బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు.

మెట్‌పల్లి రూరల్: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సాగు చేస్తున్న పంటలకు నీరందక ఎండిపోతున్నాయని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ, వరుద కాలువలకు 1000 క్యూ సెక్కులు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

● రైతులు సాగులో యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించి మంచి ఫలితాలను పొందాలని వ్యవసాయ కరీంనగర్ రిసెర్చ్ సెక్టర్ అధికారి రాంప్రసాద్ అన్నారు. మంగళవారం కరీంనగర్ రిసెర్చ్ సెక్టర్, రామకృష్ణ పొలస శాస్త్రవేత్తలు సంయుక్తంగా మండలంలోని ఆత్మకూర్‌లోని వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు.

● గ్రామాల్లో చేసిన మన ఊరి మన బడి పనుల బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని మంగళవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నీతలకు కాంట్రాక్టర్లు వినతి పత్రం అందజేశారు.

కోరుట్ల: బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇచ్‌చార్జి మానుక ప్రవీణ్ ఆరోపించారు.

● ఎన్నికల లబ్ధి కోసం ఐదు రూపాలయ భోజనాన్ని ప్రారంభించి ఎన్నికలు అయిన తర్వాత కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మూసివేశారని పట్టణ యువజన కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

ఇబ్రహీంపట్నం: ఈనెల 6న జగిత్యాలలో జరగనున్న వికలాంగుల, వృద్ధుల, వితంతుల సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాట్ల బుచ్చన్న పేర్కొన్నారు.

● ఇబ్రహీంపట్నం మండలంలోని మూలరాంపూర్, ఎర్దండీ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో సలీం పరిశీలించారు.

● ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా నియమితులైన సలీంను మండలంలోని కార్యదర్శులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు.

మల్యాల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సొంగ రమేశ్‌బాబు(55) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన రమేశ్‌బాబు వైద్యశాఖలో డ్రైవర్‌గా నియమితులు అయ్యాడు. అంత్యక్రియల నిమిత్తం అధికారులు రూ. 30 వేలు అందించారు.

పెగడపల్లి: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో శ్రేణులు కలసికట్టుగా పని చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో సమావేశం నిర్వహించారు.